# ఎవరి జాగీరని అమ్మకానికి పెట్టారో..!

(మొదటిపేజీ తరువాయి)

బదలాయింపు చేస్తూ అవే రికార్డులను కొత్తగా నమోదు చేయించారు. ఈ క్రమంలోనే ప్రైవేటు కళాశాల కోసం స్థలం కొనుగోలు చేసిన మార్వాడీలిద్దరి పేర్లు కూడ నమోదు చేయించారు. వీరితో పాటు కలకుంట్ల కుటుంబంలోని వారు సైతం రికార్డుల్లో చేరిపోయారు. భూమిని చెర పట్టి తమ సొంత జాగీరు అయినట్లు అమ్మేయడం గమనార్హం. నేటి కంప్యూటర్ కాలంలోనూ ఇంత చాకచక్యంగా.. అధికారికంగా.. భూములు చెర పడుతున్నారంటే దొరల స్థాయి ఎంత వరకుందో అర్థం చేసుకోవచ్చు. డెబ్బై సంవత్సరాల క్రితం నాటి భూములు వీరి పంచన చేరాయంటే పరిస్థితిని అంచనా వేయొచ్చు.



## ఆ ఎనిమిది మంది ఎలా వచ్చి చేరారో..!

సర్వే నెంబర్ 252 వాస్తవానికి మేకల బక్కడు అలియాస్ బుక్కయ్యకు వర్తిస్తుంది. తీన్ సాల్ పట్టాలో ఆయన పేరే ఉంది. అయితే భూమి ఈ సర్వే నెంబర్ లో ఉంటే తమ పప్పులుడకవని గుర్తెరిగి ఈ కుతంత్రం పన్నారు. కలకుంట్ల ఆండాల్ దేవి, శ్రీనివాస్ రావుల పేర్లు రికార్డుల్లోకి ఎక్కనే ఎక్కాయి. ఆండాల్ దేవి పేరిట 0.36 గుంటలు, శ్రీనివాస్ రావు పేరు మీద 1.38 ఎకరాలు ఉండగా.. మార్వాడీ అయిన శ్రావణ్ పేరు మీద 0.10 గుంటలు, కుందన్ లాల్ పేరిట 1.10 ఎకరాలు రికార్డుల్లోకి ఎక్కించారు. అదేవిధంగా మామిడాల కమల అనే మహిళా పేరు మీద ఎకరం భూమి నమోదు చేయగా ముఖేష్ పేరిట మూడు సార్లు భూమి బదలాయించారు. ఆయన పేరు మీద 0.18 గుంటలు, 0.32 గుంటలు, 1.10 ఎకరాలు వెరైటీ 8 ఎకరాల 34 గుంటల భూమి కాజేసిన నిర్వాకం కలకుంట్ల వారిది. ఎక్కడో 253 సర్వే నెంబర్ లో ఉన్న భూమిని బూచిగా చూపి మొత్తం కొట్టేశారంటే వారెంతటి ఉద్దండులో అనేది తెలుసుకోవచ్చు. ఆంటే 6 ఎకరాలు ఎరగా వేసి 8.34 ఎకరాలు స్వాహా చేశారన్న మాట. అంతటి జగత్ కిలాడీలు వీరనేది ఇట్టే స్పష్టం కాక మానదు. రెవెన్యూ యంత్రాంగాన్ని ఏదోవిధంగా ప్రభావితం చేసి భూమి దొంగ బదలాయింపు చేసుకుని ఉంటారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

## ఎక్కడి నుండి బీజాలు పడ్డాయి..?

అందుగులపేట సర్వే నెంబర్ భూమి మారడం వెనకున్న మతలబు, మంత్రాంగం ఏమిటి..? తెర ముందు ఎవరుండి కథ నడిపించారు..? అనేది నిగ్గు తేల్చాల్సిన గురుతర బాధ్యత రెవెన్యూ శాఖ అధికారుల పైనే ఉంది. తమ చేతుల మీదుగా నడిచిన ఈ దొంగ భూ బదలాయింపు చక్కదిద్దాల్సింది ఈ శాఖే. ఉన్నతాధికారులను కూడా బురిడీ కొట్టించి పట్టాల్లో భూమి మార్చేసిన కళంకం, మకిలి తొలగి పోవాలంటే ఆ మాత్రం స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సామాన్య పేదల పక్షాన నిలవకుండా భూస్వాములైన దొరలకు వత్తాసు పలుకుతూ లక్షలు, కోట్ల రూపాయల విలువైన భూములను ఎడాపెడా దుర్వినియోగం అయ్యేందుకు దోహదం పడడం రెవెన్యూ శాఖకు అంత మంచిది కాదని అంటున్నారు. కళ్ళ ముందే అధికారిక రికార్డులు అవి పేద, బుడుగు, బలహీన వర్గాల భూములని తెలిసినా తెలియనట్లు జిమ్మిక్కులు చేయడం మంచి పరిణామం కాదని చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఆర్డీవో స్పందించి కాగితాల్లో మారిన 38/ఈ పట్టా భూమి కథ తేల్చాలని బాధిత లబ్దిదారులు కోరుతున్నారు. ఇందుకు సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో చూడాలి మరి..!

# తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలి



**రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి**

**ధాన్యం బస్తాలను తరలించాలి**

**జిల్లాల్లో రైతన్నల ఆందోళనలు**

**మెదక్-సంగారెడ్డి రహదారిపై ధాన్యం బస్తాలతో రైతుల రాస్తారోకో**

ములుగు, రాజాపేట, మే18:
కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం పలు జిల్లాల్లో అన్నదాతలు ఆందోళనలు చేపట్టారు. రైతులు పండించిన అన్ని రకాల పంటలకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొనుగోళ్లలో జాప్యం లేకుండా చూడాలని, ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించాలని అధికారులను వేడుకున్నారు. ఇందులో భాగంగా.. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లి ప్రధాన రహదారిపై రైతులు నిరసన తెలిపారు.

రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ నిర్వహించిన ధర్నాలో కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, మాజీ ఎంపీపీ కొల్మ్ముల రమణ మాట్లాడుతూ.. అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారని, కేంద్రాల్లో తడిసిన ధాన్యంలో కోతలు విధించకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

# సింగపూర్‌లో మళ్లీ కొవిడ్ వేవ్..

## వారంలోనే 26వేల మందికి వైరస్!



న్యూఢిల్లీ: సింగపూర్‌లో కొవిడ్-19 కొత్త వేవ్ కోరలు చాచింది. వారం రోజుల్లోనే 26 వేల మంది వైరస్ బారిన పడ్డారు. ఈ నెల 5 నుంచి 11వ తేదీ మధ్య 25,900 కొత్త కేసులు నమోదైనట్టు వైద్యారోగ్యమంత్రి కుంగ్ తెలిపారు. ప్రజలు మళ్లీ మాస్కులు ధరించాలని, కేపీ.2 వేరియంట్ వ్యాప్తి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దవాఖానలు పడకల సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోవాలన్నారు. వచ్చే రెండు నుంచి నాలుగు వారాల్లో కొవిడ్ కేసులు గరిష్ఠస్థాయిలో పెరుగుతాయని, జూన్ మధ్య వరకు కేసులు అత్యధికంగా నమోదయ్యే అవకాశాలు ఉన్నట్టు వెల్లడించారు. ఏప్రిల్ చివరివారంలో 13,700 కేసులు నమోదైనట్టు వివరించారు.

# మరో 3రోజులు వర్షాలే



హైదరాబాద్, మే 18
దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి కొమరిన్ ప్రాంతం వరకు కొనసాగిన ఆవర్తనం శనివారం తెలంగాణ, రాయలసీమ మీదుగా దక్షిణ కర్ణాటకకు చేరింది. ఈ ఆవర్తనం సముద్ర మట్టానికి 3.1 కి.మీ ఎత్తులో కొనసాగుతున్నట్లు భారత వాతావరణశాఖ తెలిపింది. శుక్రవారం రాయలసీమ, ఉత్తర తమిళనాడు ప్రాంతంలో సముద్ర మట్టానికి 5.8 కి.మీ. ఎత్తులో కేంద్రీకృ తమైన చక్రవాతపు ఆవర్తనం శనివారం బలహీనపడింది. దీంతో రాగల మూడురోజులు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో మోస్త రు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆదివారం కొన్ని జిల్లాల్లో ఉరుము లు, మెరుపులులతో కూడిన వర్షం కురుస్తుందని, గంటకు 40-50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించింది.

# వివాహేతర సంబంధాలతో జీవితాలు నాశనం: శిల్ప

హైదరాబాద్, మే 18



సీరియల్ నటుడు చందు ఆత్మహత్యపై ఆయన భార్య శిల్ప స్పందించారు. ఐదేండ్లుగా పవిత్రతో చందు సహజీవనం చేస్తున్నాడని, త్రినయని సీరియల్ ప్రాజెక్టు వచ్చినప్పటి నుంచి వారి మధ్య వివాహేతర సంబంధం కొనసాగిందని పేర్కొన్నారు. పవిత్ర మాయలో పడి తమను పట్టించుకోవడం మానేశాడని, ఇంటికి కూడా రాలేదని తెలిపారు. వివాహేతర సంబంధాలు మూలంగా జీవితాలు నాశనం అవుతున్నాయని, తమ జీవితం కూడా అలాగే అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పవిత్ర ఆకస్మిక మరణంతో చందు మానసిక ఒత్తిడికి గురయ్యాడని, ఇటీవల కత్తితో కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాని తెలిపారు. పవిత్ర.. నీ దగ్గరకు వస్తున్నా.. అని ఇన్‌స్టాలో మెస్సెజ్‌లు కూడా పెట్టాడని పేర్కొన్నారు. శుక్రవారం చందుకు ఫోన్ చేయగా, ఎత్తకపోయేసరికి అనుమానం వచ్చి తెలిసిన వారిని ఫ్లాటుకు పంపించగా, చందు ఫ్యానుకు ఉరేకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. తనకు తన పిల్లలకు న్యాయం చేయాలని శిల్ప వేడుకున్నారు.

# రైతు గోస బీజేపీ పుణ్యమే..

- **పదేండ్లలో అదనపు భారం తప్ప.. మేలు చేసిందేమీ లేదు!**

హైదరాబాద్-మే18
మోదీ ప్రభుత్వ హయాంలో కనీస మద్దతు ధరలు నత్తనడకన పెరిగాయి. 2003-04 నుంచి 2012-13 మధ్యకాలంలో ప్రధాన ఆహార పంటల మద్దతు ధరలు ఏడాదికి సగటున 8-9 శాతం వరకు పెరగగా.. 2013-14 నుంచి 2022-23 వరకు చూసుకుంటే 5 శాతమే పెరిగాయి. స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేస్తానని మోదీ హామీ ఇచ్చారు. అంటే సీ2 ఉత్పత్తి వ్యయం కంటే 50 శాతం అధికంగా మద్దతు ధరను నిర్ణయించాలి. సీ2 ఉత్పత్తి ఖర్చు అంటే ఉత్పత్తి వ్యయం, కుటుంబ శ్రమకు సంబంధించిన విలువ, యాజమాన్య మూలధనం విలువపై వడ్డీ, భూమి అద్దె, సొంత భూమి ఉంటే కౌలు విలువ. కానీ, మోదీ ప్రభుత్వం మాత్రం ఏ2 జీఎఫ్ఎల్ (డబ్బు చెల్లించి కొనే అన్ని ఉపకరణాలు, సేవలు, జీ కుటుంబసభ్యుల శ్రమ విలువ) ఉత్పత్తి వ్యయంపై మద్దతు ధర నిర్ణయిస్తుంది. ఈ విధానంలో మూలధన ఆస్తుల విలువపై వడ్డీ, సొంత భూమికి కౌలు విలువను మినహాయించారు. ఇటువంటి తప్పుడు విధానాల కారణంగా క్వింటాలుకు దాదాపు రూ.500-600 వరకు రైతులు నష్టపోతున్నారు. మోదీ హయాంలో వ్యవసాయం సంక్షోభంలోకి కూరుకుపోయిందనడానికి నిదర్శనమే పెరిగిన రైతు ఆత్మహత్యలు. 1997-2022 మధ్యకాలంలో 3.50 లక్షల మందికిపైగా రైతులు ఆత్మహత్య చేసుకోగా 2014-2022 మధ్యకాలంలో 1,00,474 మంది బలవన్మరణానికి పాల్పడటం గమనార్హం. మోదీ సర్కార్ రెండోసారి అధికారం చేపట్టాక ఆత్మహత్యలు మరింతగా పెరిగాయి. 2019లో (10,281), 2020లో (10,677), 2021లో (10,881), 2022లో (11,290) ఇలా ఏటికేడు బలవన్మరణాలు పెరిగాయే తప్ప తగ్గలేదు. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు నష్టపరిహారం అందించడంలోనూ మోదీ ప్రభుత్వం విఫలమైంది. కేంద్ర ప్రభుత్వం 2016లో ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) అనేది ఓ విఫల పథకం. బీహార్, పశ్చిమబెంగాల్, ఏపీ, గుజరాత్, జారండ్ లాంటి అనేక రాష్ట్రాలు ఈ పథకం నుంచి వైదొలిగి సొంతంగా పంటల బీమా పథకాలను రూపొందించుకున్నాయి. ఈ పథకం కింద 2016-17లో 570.8 లక్షల హెక్టార్ల భూమికి బీమా చేయగా.. 2022-23 నాటికి అది 487.4 లక్షల హెక్టార్లకు తగ్గిపోయింది. 2018లో రూ.29,337 కోట్లుగా ఉన్న క్లెయిములు.. 2022 నాటికి రూ.18,043 కోట్లకు పడిపోయాయి. ఈ పథకం కార్పొరేట్ బీమా కంపెనీల లాభాపేక్ష కోసమే తీసుకొచ్చినట్టయింది. జాతీయస్థాయిలో రైతులకు రుణమాఫీ 2008లో అమలైంది. 2022 జూలైలో ఎస్‌బీఐ విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం.. 2014 తర్వాత ప్రకటించిన రుణమాఫీ పథకాల్లో అర్హులైన లబ్ధిదారుల్లో 50 శాతం మందికే రుణమాఫీ జరిగింది. వాస్తవానికి రుణాలు చెల్లించడంలో రైతులు అత్యుత్తమ రికార్డును కలిగి ఉన్నారు. వ్యవసాయ వృద్ధిరేటు తక్కువగా ఉన్నప్పటికీ, సంక్షోభం అంచుల్లో వ్యవసాయ రంగం ఉన్నప్పటికీ.. పారిశ్రామిక రంగం కంటే వ్యవసాయ రంగంలో నాన్ పర్ఫార్మింగ్ అసెట్స్ (ఎన్‌పీఏ) చాలా తక్కువగా (17.4 శాతం) ఉండటం గమనార్హం. వ్యవసాయ కార్మికులను కేంద్రం నిండా ముంచింది. గ్రామీణ ప్రజల ఆదాయం పెరిగిందని, ఉపాధి హామీకి కేటాయింపులు పెరిగాయని మోదీ సర్కార్ ప్రచారం చేసుకుంటున్నది. కానీ, వాస్తవమేమంటే.. గ్రామీణ భారత్‌లో నిరుద్యోగ సమస్య మరింత ఎక్కువైంది. 2013-14 నుంచి 2018-19 వరకు వ్యవసాయ, వ్యవసాయేతర కార్మికుల వేతనాల్లో ఏటా 3 శాతం తగ్గుదల నమోదైంది. ఆర్‌బీఐ ప్రకారం.. బీజేపీ పాలిత రాష్ట్రాలైన గుజరాత్, మధ్యప్రదేశ్, యూపీ కార్మికులు జాతీయ సగటు కన్నా చాలా తక్కువ రోజువారీ వేతనాలు పొందుతున్నారు. రోజువారీ వేతనం జాతీయ సగటు రూ.345.70 కాగా.. గుజరాత్‌లోని వ్యవసాయ కార్మికులు రూ.241.90 మాత్రమే పొందుతున్నారు. మధ్యప్రదేశ్‌లో అత్యల్పంగా దినసరి వేతనం రూ.221.90గా ఉన్నది. ఉపాధిహామీ పథకానికి ఏటా నిధులను తగ్గిస్తున్న బీజేపీ సర్కార్ ఆ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నది. 2013-14 బడ్జెట్‌లో 1.98 శాతం నిధులను ఈ పథకానికి కేటాయించగా.. 2023-24 నాటికి ఆ మొత్తం 1.33 శాతానికి తగ్గడమే అందుకు నిదర్శనం. ఓ నివేదిక ప్రకారం.. గత 21 నెలల్లో దేశవ్యాప్తంగా 7.6 కోట్ల జాబ్‌కార్డులను తొలగించారు. చట్టంలో వంద రోజుల పాటు పని కల్పించాలని హామీ ఉన్నప్పటికీ 2020-21లో తప్ప మిగిలిన అన్ని సంవత్సరాల్లోనూ సగటు పనిదినాలు 50కి మించలేదు. కార్మికులకు చెల్లించే సగటు వేతనాలు పెరగడం లేదు. నేషనల్ శాంపిల్ సర్వే సంస్థ (ఎన్ఎస్ఎస్‌వో) నివేదిక ప్రకారం.. 2018-19లో 41 శాతం గ్రామీణ కుటుంబాలకు భూమి లేదు. అభివృద్ధి పేరిట కార్పొరేట్లకు వ్యవసాయ భూములను కట్టబెడుతుండటంతో కొద్దిపాటి సాగు భూమిని కూడా రైతులు కోల్పోతున్నారు. పరిహారం విషయంలోనూ రైతులకు అన్యాయం జరుగుతున్నది. రుణాలు, సామాజిక భద్రత తదితర అంశాల్లోనూ వ్యవసాయ కార్మికులు అన్యాయానికి గురవుతున్నారు. 2019లో ప్రారంభమైన ప్రధానమంత్రి శ్రమయోగి మన్-ధన్ పింఛన్ పథకం వల్ల కార్మికులకు ప్రయోజనం చేకూరడం లేదు. వలస కార్మికుల తరపున సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడంతో కేంద్ర ప్రభుత్వం అసంఘటిత కార్మికుల జాతీయ డేటాబేస్‌ను ప్రారంభించే లక్ష్యంతో 2021లో శ్రమ పోర్టల్‌ను ప్రారంభించింది. కానీ, అందులో ఎలాంటి సామాజిక ప్రయోజనాలను ప్రకటించలేదు. కార్పొరేట్ మీడియా ఈ పోర్టల్‌కు పెద్దఎత్తున ప్రచారం కల్పించింది. కానీ, వాస్తవానికి ఈ పథకం నుంచి ఒక్క వ్యవసాయ కార్మికునికి కూడా ప్రయోజనం చేకూరలేదు. ఇలా.. ప్రతీ పథకంలో వాస్తవాలు ఒకలా ఉంటే బీజేపీ మాత్రం తనకు అనుకూలంగా ప్రచారం చేసుకుంటూ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నది. దేశ ప్రజలు నిజాలను గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

# 24 గంటల్లోనే ట్యాంకర్ డెలివరీ..

సిటీబ్యూరో, మే 18, : బుక్ చేసిన 24 గంటల్లోనే ట్యాంకర్‌ను డెలివరీ చేస్తున్నట్లు జలమండలి అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులకు వేగంగా సేవలందించేందుకు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను జలమండలి వినియోగించిందన్నారు. వేసవి ప్రారంభం కాకముందే ఫిబ్రవరి నుంచే నీటికి డిమాండ్ ఏర్పడటం, బోర్లపై ఆధారపడే ప్రాంతాల ప్రజలు జలమండలి ట్యాంకర్లను భారీగా బుక్ చేసుకున్నట్లు వివరించారు. పలు ప్రాంతాల్లోని 30వేలకు పైగా ప్రజలు ట్యాంకర్లపైనే ఆధారపడ్డారని, దీంతో 2, 3 రోజులకు ఒకసారి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసే స్థితి వచ్చిందన్నారు. ఆలస్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడటంలో అప్రమత్తమైన ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్, ఎండీ సుదర్శన్‌రెడ్డి వరుస సమీక్షలతో కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. ట్యాంకర్ల సంఖ్య పెంచడం, కొత్త ట్యాంకర్ల కొనుగోలుతో పాటు అద్దెకు ట్యాంకర్లను సమకూర్చినట్లు పేర్కొన్నారు. వాటర్ ఫిల్లింగ్ స్టేషన్లు, ఫిల్లింగ్ పాయింట్స్‌ను పెంచడం, ట్యాంకర్ డెలివరీలో వేగం పెంచుతూ సిబ్బందిని మూడు షిఫ్టుల్లో పనిచేసేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ట్యాంకర్ మేనేజ్‌మెంట్ సెల్, ప్రత్యేక యాప్ వంటి విధానాలను అమలు చేసి.. ప్రస్తుతం 24 గంటల్లోనే ట్యాంకర్ నీటిని అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎండీ సుదర్శన్‌రెడ్డి అప్రమత్తత, నిరంతర పర్యవేక్షణ, అధికారులు, సిబ్బంది సమష్టి కృషి ఫలితంగానే ఇది సాధ్యమైందన్నారు.



# ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సీపీఎం మద్దతు

హైదరాబాద్, మే 18 :
నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. కూటమిలో భాగంగా మద్దతునిస్తున్నామని వెల్లడించారు.



# బస్సులో నుంచి జారిపడి మహిళ మృతి

## ఉచిత బస్సు పథకం తెచ్చిన తంటా




కొణిజర్ల, మే 18 :
మహిళలకు ఉచిత బస్సు పథకంతో బస్సులన్నీ కిక్కిరిసిపోతున్నాయి. ఈ క్రమంలోనే ఓ మహిళ బస్సులో చోటులేక ఫుట్‌బోర్డుపై నిలబడటంతో ప్రమాదవశాత్తు జారిపడి ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన ఖమ్మం జిల్లాలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొణిజర్ల మండల పరిధిలోని పెద్దమునగాలకు చెందిన దూరి అనూష (26) ఖమ్మం నగరంలోని డీమార్ట్‌లో పనిచేస్తున్నది.

# విద్యుత్తు ఒప్పందాలపై పది రోజుల్లో ఫిర్యాదు చేయండి



హైదరాబాద్, మే 16 : యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌తో పాటు ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు ఒప్పందాలపై పది రోజుల్లోగా ఫిర్యాదు చేయాలని జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి కమిషన్ తెలిపింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది.

# క్యాన్సర్ కారకాలు-చికిత్సపై పుస్తకం

ఉస్మానియా యూనివర్సిటీ:
సీపీఎంబీ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ కంచ ఎడిటర్‌గా క్యాన్సర్ వ్యాధిపై సమగ్ర సమాచారంతో ముద్రించిన పుస్తకాన్ని ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. సీపీఎంబీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ 26 చాప్టర్లుగా పుస్తకాన్ని రూపొందించినట్లు చెప్పారు.



# ఉత్తరాంధ్రలో కాక రేపుతున్న ఇద్దరు మిత్రులు !



ఉత్తరాంధ్రలో కీలక రాజకీయ నాయకులు మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్. విశాఖ, విజయనగరం జిల్లాలకు వీరిద్దరూ రెండు దశాబ్దాలుగా ఆ ప్రాంతం మీద ప్రభావం చూపుతున్నారు. 1999లో కాంగ్రెస్ నుంచి బొత్స బొబ్బిలి ఎంపీగా, టీడీపీ నుంచి గంటా అనకాపల్లి ఎంపీగా ఇద్దరూ ఒకేసారి గెలిచి పార్లమెంటులో అడుగు పెట్టారు. ఆ తర్వాత జరిగిన శాసనసభ ఎన్నికల్లో చీపురుపల్లి నుంచి బొత్స, చోడవరం నుంచి గంటా ఇద్దరు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు.2014లో రాష్ట్ర విభజన తర్వాత కూడా పీసీసీ అధ్యక్షుని హెూదాలో కాంగ్రెస్ పార్టీలో ఉండి బొత్స సత్యనారాయణ తొలిసారి ఓటమిని చవి చూస్తే, రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ఓటమి ఎరుగని నాయకుడిగా నియోజకవర్గాలు మారుస్తూ గంటా శ్రీనివాసరావు తన రాజకీయ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నాడు. రాజకీయాలకు వచ్చిన తొలి రోజుల్లో ఇద్దరూ మంచి మిత్రులు. ఇద్దరూ కిరణ్ కుమార్ రెడ్డి కేబినెట్‌లో మంత్రివర్గ సహచరులుగా కలిసి పనిచేశారు. 2014 తర్వాత గంటా టీడీపీకి తిరిగి వెళ్లడంతో రాజకీయ మిత్రులుగా ఉన్న బొత్స, గంటా ప్రత్యర్థులుగా మారిపోయారు. బొత్స పీసీసీ అధ్యక్షుడిగా ఉన్ననాటి నుంచే ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు ప్రారంభం అయింది. అప్పుడప్పుడు ఇద్దరి మధ్య మాటల యుద్ధం కూడా జరిగింది. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు.ఏపీలో ఎన్నికల ప్రక్రియ ముగియడంతో అందరూ ఫలితాల కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలోఎప్పుడూ లేనిదీ ఇప్పుడు ఇద్దరూ మిత్రులు ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుంటున్నారు. జూన్ 9వ తేదీన చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని గంట శ్రీనివాసరావు జోస్యం చెప్తుంటే, బొత్స సత్యనారాయణ ఇంకోక అడుగు ముందుకేసి అదే జూన్ 9న విశాఖ వేదికగా జగన్ మరోసారి సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తారనీ, మాజీ మంత్రి హెూదాలో గంటా శ్రీనివాసరావుకు కూడా ఆహ్వానం పంపుతామని బొత్స కౌంటర్ ఇస్తున్నాడు. ఈ నేపథ్యంలో జూన్ 4న ఏం జరుగుతుంది ? ఫలితాలు ఎలా వస్తాయి ? అని అందరూ ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

# ఆ ముగ్గురూ బీజేపీ పాతకాపులే !



గత ఎన్నికల్లోనూ బలమైన ఓట్లు సాధించడమే కాకుండా విద్యావంతుల ఆదరణ తమకే ఉందని నిరూపించే సంకల్పంతో బీజేపీ ఈ స్థానంపై కన్నేసింది. ఇటీవల ముగిసిన లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో పలు స్థానాల నుండి బీజేపీ, కాంగ్రెస్ పార్టీల తరపున బీఆర్ఎస్ నుండి చేరిన వారే ఎంపీ బరిలో అభ్యర్థులుగా నిల్చున్నారు. అయితే నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల శాసనమండలికి జరుగుతున్న ఉప ఎన్నికల్లో ముగ్గురూ బీజేపీ పాతకాపులే పోటీ చేస్తుండడం విశేషం. నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులతో సహా 52 మంది పోటీ పడుతున్నారు. సిట్టింగ్ సీటును నిలబెట్టుకోవడమే లక్ష్యంగా బీఆర్ఎస్ పావులు కదుపుతుండగా, ఈసారి ఎలాగైనా పాగా వేయాలనే కాంగ్రెస్ పట్టుదలతో వ్యవహరిస్తోంది. గత ఎన్నికల్లోనూ బలమైన ఓట్లు సాధించడమే కాకుండా విద్యావంతుల ఆదరణ తమకే ఉందని నిరూపించే సంకల్పంతో బీజేపీ ఈ స్థానంపై కన్నేసింది. ఇక్కడ కాంగ్రెస్ నుండి తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్, బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నుండి ఏనుగుల రాకేష్ రెడ్డి బరిలో ఉన్నారు. తీన్మార్ మల్లన్న గతంలో బీజేపీలో చేరి బయటకు రాగా, అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ రాకపోవడంతో రాకేష్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరాడు. ప్రేమేందర్ రెడ్డి ఇదే స్థానం నుండి గత ఎన్నికల్లో బీజేపీ తరపున ఓడిపోవడం విశేషం. ముగ్గురు పాత్రధారులు పోటీ పడుతున్న ఈ ఎన్నికలో ఎవరు గెలుస్తారా అని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# తడిసిన ధాన్యం.. రైతన్న ఆగమాగం

**వివిధ జిల్లాల్లో కురిసిన వర్షం**

**కల్లాల్లో, కేంద్రాల్లో ధాన్యం వర్షార్పణం**

**పిడుగుపాటుకు 15 గొర్రెలు మృతి**

**ఉధృతంగా మోరంచ వాగు ప్రవాహం**

అకాల వర్షానికి రైతులు ఆగమవుతున్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసి ముద్దయింది. సంగారెడ్డి జిల్లాలోని పలుచోట్ల శనివారం మధ్యాహ్నం వాన దంచికొట్టింది. కొనుగోలు కేంద్రాలకు వడ్లను తీసుకొచ్చిన రైతులు వర్షానికి ఇబ్బందిపడ్డారు. వడ్లను కాపాడుకోనేందుకు పట్టాల కోసం ఉరుకులు, పరుగులు పెట్టారు. అక్కడక్కడా రోడ్లపై వడ్లు ఆరబోసిన రైతులు ఆగమయ్యారు. నల్లగొండ జిల్లాలోని కట్టంగూర్ మండలంలో 65.5 మిల్లీమీటర్లు, మిర్యాలగూడలో 26.3 మిల్లీ మీటర్లు, దామరచర్లలో 17.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిర్యాలగూడ మండలంలోని జేత్యాతండాలో పిడుగు పడటంతో మాలోతు తావుర్యాకు చెందిన 15 గొర్రెలు మృత్యువాత పడ్డాయి.తావుర్యాకు గాయాలు కాగా దవాఖానకు తరలించారు. వేములపల్లి మండలం ఆమనగల్లులో పిడుగుపడగా ఒకరికి గాయాలయ్యాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నల్లమల అమ్రాబాద్, జడ్చర్ల, భూత్పూరులో భారీగా, నాగర్‌కర్నూల్, గద్వాల, రాజాపూర్, తాడూరులో ఓ మోస్తరు వర్షం కురిసింది. జడ్చర్లలో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. మురుగు కాల్వలు నిండి పారడంతో పలు కాలనీల్లోకి నీరు వచ్చి చేరింది. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా గుణపురం మండలంలోని సీతారాంపురం, వెల్తుర్లపల్లి గ్రామాల మధ్యలోని మోరంచ వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. వాగు పరిసర ప్రాంతాల్లోని వరి పంట పొలా లు నీట మునిగాయి. నేలవాలిన వరిపంట చేతికందే దశలో నీటిలోనే మొలకెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో 20 రోజుల్లో కోతలు పూర్తి చేసి ధాన్యాన్ని విక్రయించే సమయంలో వర్షాలు తమ పాలిట శాపంగా మారాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గణపురం మండల కేంద్రంతోపాటు కొండాపూర్, ధర్మారావుపేట, నగరంపల్లి, చెల్పూర్, బుద్ధా రం, మైలారంలో పంట నీట మునగడంతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది.

### ఎడతెగని వర్షం.. మొలకెత్తిన 'నష్టం'

అకాలవర్షం అన్నదాతను కోలుకోలేని దెబ్బతీస్తున్నది. మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వానలు రైతన్న కంటిమీద కునుకును దూరం చేస్తున్నాయి. కల్లాలు, కేంద్రాల్లోని వడ్లు కండ్లముందే తడిసి ముద్దవుతుంటే రైతుకంట కన్నీటి ధారలు వర్షిస్తున్నాయి. వడ్లు కొంటామన్న సర్కారు ప్రకటనలు కాగితాలకే పరిమితమవుతుంటే అన్నదాత బతుకులు ఆగమవుతున్నాయి. కామారెడ్డి మండలం క్యాసంపల్లిలో రెండురోజుల క్రితం కురిసిన వర్షానికి తడిసి మొలకలెత్తిన ధ్యాన్యాన్ని ఎత్తుతున్న మహిళా రైతు అనసూయ.

# టీడీపీతోనూ పవన్ ఫైట్ చేయొచ్చు...!



ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే పవన్ కళ్యాణ్ కి ప్రయారిటీ ఇవ్వక తప్పదని ఆయన అన్నారు. ఒపటి రోజున టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే జనసేన రోల్ ఎలా ఉంటుంది అలాగే ఏపీ రాజకీయాల మీద ఒక యూట్యూబ్ చానల్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఒకనాడు పవన్ కి అత్యంత సన్నిహితులుగా ఉన్న రాజు రవితేజ కీలకమైన విశ్లేషణ చేశారు. ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే పవన్ కళ్యాణ్ కి ప్రయారిటీ ఇవ్వక తప్పదని ఆయన అన్నారు. అదే జరిగితే అపుడు టీడీపీ యువనేత నారా లోకేష్ ఫ్యూచర్ ఇబ్బందుల్లో పడుతుందని కూడా ఆయన అంచనా వేశారు. మరో వైపు చూస్తే పవన్ కళ్యాణ్ భవిష్యత్తులో టీడీపీతోనూ రాజకీయ పోరాటం చేసే అవకాశాలు ఉన్నాయని జోస్యం లాంటి అంచనా చెప్పారు. ఈ రోజున మిత్రులుగా ఇద్దరూ కూటమిలో ఉన్నా పవన్ చంద్రబాబుని విభేదించే చాన్స్ కూడా ఉందని అన్నారు. ఉత్తరాంధ్రలో కాక రేపుతున్న ఇద్దరు మిత్రులు ! తనకు ఎవరైతే చాలా దగ్గరగా ఉంటారో వారితోనే ఎక్కువగా పోరాటం చేస్తారు అని ఆయన మరో మాటగా చెప్పారు. జనసేన నుంచి నేతలు బయటకు ఎక్కువగా వెళ్ళడానికి కారణం వారి అనుకున్నది అక్కడ జరగకపోవడమే అని ఆయన అన్నారు. తగిన అవకాశాలు కల్పిస్తూ నాయకులను తయారు చేసే చోటనే ఎవరైనా ఉంటారని ఆయన అన్నారు. ఇక టీడీపీ కూటమి కనుక విపక్షంలో ఉంటూ జగన్ నాయకత్వంలో వైసీపీ అధికారంలోకి వస్తే ఏమి జరుగుతుంది అంటే దాని మీద కూడా ఆయన సునిశిత విశ్లేషణ చేశారు. ఏపీలో అధికార పార్టీ మీద మరోసారి విపక్షాలు అంతా కలసి భీకరమైన పోరాటం చేస్తాయని అది తారస్థాయిలో సాగుతుందని అన్నారు. ఆ దేశంలో విదేశీ విద్యార్థులపై దాడులు... భారత ప్రభుత్వం అలర్ట్! ఏపీలో మతపరమైన కలహాలు వంటి పరిణామాలు చోటు చేసుకున్నా ఆశ్చర్యం లేదు అని ఆయన అంటున్నారు. అదే విధంగా చూస్తే ఏపీలో రాజకీయం ఢీ అంటే ఢీ అన్నట్లుగా మారిపోవడం వెనక అధికార దాహం ఎక్కువ కావడమే అసలు కారణం అన్నారు. పేదలకు పెత్తందారులకు మధ్య పోరాటంగా ఏపీ రాజకీయం సాగుతోందా అన్న అన్న దానిని ఆయన బదులిస్తూ ప్రభుత్వం పేదల పక్షంగానే ఉండాలని వారి విద్య వైద్యం వంటి వాటి విషయంలో శ్రద్ధ వహించాలని సూచించారు. పెద్దలకు మేలు చేసే కార్పోరేట్ విధానాల వల్ల ధనికులు మరింత ధనికులు అవుతారు అని ఆయన చెప్పుకొచ్చారు. ఏ ప్రభుత్వం అయినా ధనవంతుల క్లబ్ గా మారరాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆ ముగ్గురూ బీజేపీ పాతకాపులే ! పచ్చని పోలాలను భూములను కార్పోరేట్ శక్తులకు దారాదత్తం చేసి ఆ భూములలో కాంక్రిట్ జంగిల్స్ నిర్మించడం వల్ల పేదలకే తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు. సొంత భూములు కోల్పోయి వారు అక్కడే చిరుద్యోగులుగా కూలీలుగా మారిఒపతారని ఆయన అన్నారు. అదే విధంగా చూస్తే కనుక బడా పరిశ్రమల స్థాపన వల్ల రాష్ట్రానికీ పేదలకు దక్కే ప్రయోజనం అతి తక్కువగానే ఉంటుందని ఆయన అన్నారు. ప్రభుత్వాలు పేదలను పైకి తీసుకుని వచ్చే కార్యక్రమాలు ఎక్కువగా చేపట్టాలని అన్నారు. మధ్యతరగతి వర్గం ఎక్కువగా ఉంటేనే సమాజానికి మేలు జరుగుతుందని తనదైన విశ్లేషణ వింపించారు. పేదరికం ఎంత తగ్గితే అంతలా సమాజానికి మేలు అని అన్నారు.

# బిగ్ స్టేట్ లో బీజేపీకి షాక్ !?




దేశంలోనే అతి పెద్ద రాష్ట్రం. దేశంలో అధికారం ఎవరు అందుకోవాలన్నా అతి పెద్ద నంబర్ తో ఎంపీలను ఇచ్చే రాష్ట్రం అయిన ఉత్తర ప్రదేశ్ లో బీజేపీకి బిగ్ షాక్ ఈసారి తగులుతుందా అంటే విశ్లేషకులు అవును అనే అంటున్నారు. యూపీలో 80 దాకా ఎంపీ సీట్లు ఉన్నాయి. 2014, 2019లలో బీజేపీ అత్యధిక శాతం సీట్లు ఇక్కడే గెలుచుకుంది. 2019లో అయితే ఏకంగా 70 కి పైగా సీట్లు ఆ పార్టీ సొంతం అయ్యాయి.అదే కేంద్రంలో బీజేపీకి బలం అయింది. అలాంటి యూపీ బీజేపీకి ఇపుడు రివర్స్ లో షాక్ ఇస్తే మాత్రం అది చాలా రాజకీయ నష్టాన్ని కలిగిస్తుంది అని అంతా అంటున్నారు. బీజేపీకి కీలకమైన రాష్ట్రంగా ఉన్న యూపీలో ఈసారి పదిహేను సీట్లలో తగ్గిపోతాయని అని అంటున్నారు.ప్రొఫేసర్ నాగేశ్వర్ దీని మీద ఒక యూట్యూబ్ చానల్ లో విశ్లేషణ చేస్తూ బీజేపీ మీద స్పష్టంగా అసంతృప్తి బీజేపీ మీద యూపీ ప్రజలలో కనిపిస్తోంది అని అన్నారు. యోగీ ప్రభుత్వం వచ్చాక పశు వధ శాలను నిషేధించారు. ఉపయోగపడలేని పశువులు ఇతరత్రా వంటి వాటిని అమ్ముకోవడానికి వారికి ఇబ్బందికరంగా ఉంది.ప్రధాని కిసాన్ యోజన సాయం ఇస్తున్నా దాని కంటే అనేక రెట్లు ఈ పశువుల పోషణకు అయ్యే ఖర్చు ఎక్కువగా ఉంది అని అంటున్నారు. దాంతో వివిధ సామాజిక వర్గాలకు చెందిన రైతులు అంతా బీజేపీని వ్యతిరేకిస్తున్నారు అని అంటున్నారు. చెరుకు రైతులకు మద్దతు ధర పెరగకపోవడంతో కూడా అసంతృప్తి ఎక్కువగా ఉంది అని అన్నారు.ఇక వివిధ సామాజిక వర్గాలు నాన్ యాదవ వర్గాలు జాట్ సామాజిక వర్గాలు కూడా బీజేపీని వ్యతిరేకిస్తున్నారు అని అంటున్నారు. రాజ్ పుట్లు కూడా బీజేపీని వ్యతిరేకిస్తున్నారు అని అంటున్నారు. గుజరాత్ బీజేపీ సీఎం రూపాలా రాజు పుట్లు మీద చేసిన వ్యాఖ్యలు అలగే యోగీ ఆదిత్యనాథ్ ని దించుతారు అన్న ప్రచారంతో కూడా వారు అంతా బీజేపీని వ్యతిరేకిస్తున్నారు అన్నది ఆయన విశ్లేషణగా ఉంది.రాజ్ పుట్లు మీటింగులు పెట్టి మరీ బీజేపీని గట్టిగా వ్యతిరేకిస్తున్నారు అని అంటున్నారు. జాట్లలో కూడా బీజేపీ మీద అధిక శాతం వ్యతిరేకత పెంచుతున్నారని అంటున్నారు. అలాగే అనేక ఉత్తరాది రాష్ట్రాలలో యువత నిరుద్యోగం విషయంలో బీజేపీ ప్రభుత్వం మీద మండి పోతున్నారు అని అంటున్నారు.రైతాంగ ఉద్యమాన్ని జాట్లు నడిపారు. ఆ ఉద్యమం ద్వారా వ్యతిరేకతను బీజేపీ మూటకట్టుకుంది అని అంటున్నారు. బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు లేకుండా చేస్తారు అని పెద్ద ఎత్తున చేస్తున్న విపక్షాల ప్రచారం నేపథ్యంలో అది తీవ్ర స్థాయి వ్యతిరేకతను పెంచుతోంది అని అంటున్నారు.దళిత్ జాతోలు యాదవ్ లు అంతా యూపీలో ఇపుడు ఏకీకృతం అవుతున్నారు అని అంటున్నారు. ఎస్పీ యూపీలో ఇచ్చిన పిలుపు కూడా బీజేపీకి సెగ తగిలేలా చేస్తోంది. ఎస్పీ సోషల్ ఇంజనీరింగ్ తో బీజేపీని దెబ్బ తీసే పని కూడా జరుగుతోంది. ఆ విధంగా కూడా యూపీలో కలవరపెడుతోంది అని అంటున్నారు.అయితే ఇన్ని జరిగినా కూడా బీజేపీ బాగానే సీట్లు తెచ్చుకోవచ్చు అని అంటున్నారు. బీజేపీకి ఉన్న ఆర్గనైజింగ్ కెపాసిటీ అలాగే మోడీ ఇమేజ్, యోగీ పాలన పట్ల ఉన్న వచ్చే సానుకూలత, అలాగే రామ మందిరం ఇష్యూ వల్ల సానుకూలత ఉంది. మజ్లిస్ వంటి పార్టీలు విడిగా పోటీ చేయడం కూడా బీజేపీకి లాభం. అయితే ఇపుడు వస్తున్న విశ్లేషణలు చూస్తే కనుక బీజేపీ పది నుంచి పదిహేను సీట్లు పైన చెప్పిన కారణాల వల్ల కోల్పోతుంది అన్నది ప్రొఫేసర్ చెబుతున్న విశ్లేషణగా ఉంది. ఏమి జరుగుతుందో చూడాల్సి ఉంది.

## 20 నుంచి యాదగిరిగుట్టలో జయంత్యుత్సవాలు

యాదగిరిగుట్ట, మే18: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామివారి ప్రధానాలయం, అనుబంధ ఆలయాలైన పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంతోపాటు జనగామ జిల్లా బచ్చన్నపేట మండంల దుబ్బగుంటపల్లి యోగానందనరసింహ స్వామి ఆలయంలో ఈ నెల 20 నుంచి 22 వరకు జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు శనివారం వెల్లడించారు. 20న స్వస్తివాచనం, 21న లక్ష పుష్పార్చన, 22న మూలమంత్ర హవనం, నృసింహ జయంతి, నృసింహ ఆవిర్భావం, మహానివే దన, తీర్థప్రసాద గోష్టి నిర్వహించి ఉత్సవాలు పరిపూర్ణం చేయనున్నట్లు చెప్పారు. ఉత్సవాల నేపథ్యంలో సుదర్శన నారసింహ హెూమం, నిత్య, శాశ్వత కల్యాణాలు, బ్రహ్మోత్సవాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

## గ్రేటర్‌లో పలుచోట్ల భారీ వర్షం


**లింగంపల్లిలో అత్యధికంగా 6.88 సెం.మీలు**

**మరో రెండు రోజులు వానలు: వాతావరణ కేంద్రం**

సిటీబ్యూరో, మే 18 : బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం, అల్పపీడనం ప్రభావంతో గ్రేటర్‌లోని పలు చోట్ల శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రాత్రి 10 గంటల వరకు లింగంపల్లిలో అత్యధికంగా 6.88 సెం.మీలు, చందానగర్‌లో 5.80, హస్తినాపురంలో 5.68, వనస్థలిపురంలో 5.0, నాచారం, రామంతాపూర్‌లో 4.78, రామచంద్రాపురం, బీహెచ్‌ఈఎల్‌లో 4.60, నాగోల్, అల్కాపురి కాలనీ, సరూర్‌నగర్‌లో 4.50 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీఎస్‌డీపీఎస్ అధికారులు వెల్లడించారు.

# కొత్త సీఎంకి ముందుంది ముళ్ళ బాటే !





ఏపీ అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. అయిదేళ్ళ పాటు సాగే కొత్త ప్రభుత్వాన్ని జనాలు ఎన్నుకోబోతున్నారు. ఎవరు నూతన ముఖ్యమంత్రి అవుతారు అన్నది ప్రజలు తీర్పు ఇప్పటికే ఇచ్చేశారు. అది ఈవీఎంలలో భద్రంగా ఉంది. జూన్ 4న ఈవీఎంలను తెరిస్తే చాలు రాజకీయ పార్టీల జాతకాలు బయట పడతాయన్నది వాస్తవం.ఏపీ వరకూ చూస్తే రెండే పేర్లు కొత్త సీఎం రేసులో ఉన్నాయి. ఒకరు ప్రస్తుత సీఎం వైఎస్ జగన్. రెండవ వారు మాజీ సీఎం చంద్రబాబు. ఈ ఇద్దరిలో ఒకరికి కచ్చితంగా చాన్స్ ఉంది. ఏమైనా అనూహ్య పరిణామాలు జరిగితే కొత్త పేరు రావచ్చేమో కానీ నూటికి తొంబై తొమ్మిది శాతం ఈ ఇద్దరిలోనే ఒకరు సీఎం అవుతారు.ఈ ఇద్దరిలో ఒకరు అయిదేళ్ళ పాటు సీఎం గా చేసిన అనుభవం ఉన్న వారు అయితే మరొకరు పద్నాలుగేళ్ళ పాటు సీఎంగా చేసిన వారు. ఇక ఈ ఇద్దరికీ విభజన ఏపీ ఆర్థిక పరిస్థితి బాగా తెలుసు. ఆదాయం ఎంత అప్పులు ఎంత అనేది బాగా తెలుసు. 2014 నుంచి 2019 దాకా పాలించిన చంద్రబాబు అప్పులు తన పరిధిలో చేశారు.దాని కోసం ఆయన తనదైన మార్గాలను ఎన్నుకున్నారు. ఇక అప్పులు పుట్టవని కేవలం వంద కోట్ల రూపాయలు మాత్రమే ఖజానాలో ఉంచి మరీ అప్పటి ప్రభుత్వం దిగిపోయింది. జగన్ వచ్చాక అప్పులను ఎలా చేయాలో సరికొత్త దారులు అన్వేషించారు. దాంతో ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేస్తూ పోయారు అన్న టాక్ ఉంది.విపక్షాలు చెప్పే మాట పదమూడు లక్షల కోట్ల రూపాయలు పై చిలుకు ఏపీ అప్పు ఉందని, అధికార వైసీపీ అయితే తక్కువ అప్పులే చేశామని అన్నీ కలిపి ఏడెనిమిది లక్షలు ఉంటాయని. ఎవరెన్ని చెప్పినా ఏపీ అప్పులు అక్షరాలా పది లక్షల కోట్లకు మించే ఉంటాయన్నది ఒక మాటగా ఉంది.ఇక కొత్త ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే చేయాల్సిన తక్షణ పనులు చాలా ఉన్నాయి. ముందుగా ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి. అది అయిదారు వేల కోట్ల దాకా ఉంటుంది. సామాజిక పెన్షన్లు జగన్ వస్తే మూడు వేల రూపాయలు వంతున అనుకున్న జూన్ నెలకు అయిదు వేల కోట్లు, అదే చంద్రబాబు అయితే నాలుగు వేల రూపాయలు అంటే అది ఆరేడు వేల కోట్ల రూపాయలు అవుతాయి. ఇక సంక్షేమ పథకాలకు నిధులు జగన్ ప్రభుత్వం బటన్ నొక్కి పెండింగులో పెట్టింది. దానిని తక్షణం రిలీజ్ చేయాలి. ఆ సొమ్ము పదివేల కోట్ల రూపాయలు గా ఉంది. ఇంకా ప్రభుత్వ పాలనా పరమైన దైనందిన వ్యవహారాల కోసం చాలా ఖర్చులు ఉన్నాయి.వీటికి డబ్బు అర్జంటుగా తేవాల్సిందే. అంటే అప్పులు తీసుకుని రావాల్సిందే. ఇక ఈ ఏడాది అంతా కూడా అప్పులు ఇంకా ఇబ్బడి ముబ్బడిగా చేయాల్సి ఉంది. రానున్న నెలలలో చూస్తే చాలా మంది ప్రభుత్వ ఉద్యోగులు వేలల్లో రిటైర్ అవుతున్నారు. ఒక్కొక్కరికీ కనీసంగా యాభై లక్షలకు తక్కువ లేకుండా డబ్బులు చెల్లించి మరీ ఇంటికి పంపించాలి. అంతే కాదు ఓల్డ్ పెన్షన్ స్కీం ప్రకారం వారు రిటైర్ అవుతున్నారు.వారికి లాస్ట్ శాలరీలో సగం తొలి పెన్షన్ గా వస్తుంది. అలా చెల్లిస్తూ పోవాలి. మరో వైపు చూస్తే డీయేలు కూడా పెండింగులో చాలా ఉన్నాయి. కొత్త పీఆర్సీ వేసి మంచి ఫిట్ మెంట్ తో ఉద్యోగులకు ఇవ్వాలి. దాంతో ఉద్యోగుల జీతాలకు ఏటా మరో పది నుంచి పదిహేను వేల కోట్లు అదనంగా అవుతుంది. చంద్రబాబు అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలకే జగన్ కంటే రెట్టింపు సొమ్ము కేటాయించి ఇవ్వాల్సి ఉంటుంది.చంద్రబాబు మెగా డీఎస్సీ మీద తొలి సంతకం అన్నారు. అలా రెండు లక్షల మంది కొత్త టీచర్ల నియామకాలు అంటే ఖజనాకు అది వేల కోట్ల రూపాయల భారంగానే ఉంటుంది. ఉద్యోగ వర్గాలతో పాటు ఇక కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన మొత్తాల బకాయిలు పేరుకుపోయి ఉన్నాయి.అదే విధంగా అభివృద్ధి చేసి చూపించాలి. రోడ్లు వంటివి వేయాలన్నా ఇబ్బండి ముబ్బడిగా సొమ్ము ఖర్చు అవుతుంది. పాలన గాడిలో పెట్టాలంటే కూడా దానికి తగిన ఖర్చు వేరే ఉంటుంది. అసలు వీటన్నింటి కంటే కూడా ఏపీకి ఉన్న అతి పెద్ద సమస్య అప్పులు తేవడం. రోజు వారీ వ్యవహారాలకే అప్పులు తెచ్చి నడుపుతున్న భాగోతం ఉందని విమర్శలు ఉన్నాయి.దాంతో నెత్తిన పెట్టుకున్న అనేక కొత్త హామీల అమలుతో పాటు చాలా వాటి కోసం ఎలా సొమ్ములు తెస్తారు అన్నది పెద్ద ప్రశ్న.

జగన్ సైతం రెండోసారి అధికారంలోకి వచ్చినా పూర్వం మాదిరిగా పథకాలకు ఠంచనుగా నిధులు ఇవ్వలేరు అన్న మాట కూడా ఉంది. ఎవరు అధికారంలోకి వచ్చినా కేవలం నెలల వ్యవధిలోనే వ్యతిరేకత మూటకట్టుకుంటారు అన్న ప్రచారమూ ఉంది. బీజేపీ కేంద్రంలో ఉంది కానీ ఏపీ విషయంలో ఎవరు అధికారంలో ఉన్నా వారి సాయం పరిధి మేరకే ఉంటుంది సో ఏపీలో కొత్త సీఎం కి అంతా ముళ్ళ బాటే అని అంటున్నారు.



# ఖడ్గమృగం తెచ్చి... నన్ను సొంతం చేసుకోండి

## నటి అనుపమ పరమేశ్వరన్ ఆఫర్

మలయాళ ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్ బంపరాఫర్ ఇచ్చింది. తనకు ఒక ఖడ్గమృగాన్ని తెచ్చి బహుమతిగా ఇస్తే మీ సొంతం అయిపోతానని చెప్పేసింది. ఇప్పుడు ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఎందుకంటే అనుపమ లాంటి అమ్మాయి ఆఫర్ ఇస్తే ఎవరు కాదంటారు చెప్పండి. కచ్చితంగా ఆ గిఫ్ట్ కొనిచ్చేస్తారుగా. ఇంతకీ అనుపమ ఏం చెప్పింది? అసలేం జరిగింది? మలయాళ 'ప్రేమమ్'తో హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభించిన అనుపమ.. 'అఆ' మూవీతో టాలీవు డ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత 'శతమానం భవతి', 'హలో గురు ప్రే మ కోసమే', 'కార్తికేయ 2' తదితర చిత్రాలు చేసింది. రీసెంట్‌గా రవితేజ 'ఈగల్'లో కీలక పాత్రలో కనిపించింది. ఈమె సూపర్ హాట్‌గా నటించిన 'టిల్లూ స్క్వేర్' త్వరలో థియేటర్లలోకి రానుంది. సినిమాల సంగతి పక్కన బెడితే సోషల్ మీడియాలోనూ చురుగ్గా ఉంటే అనుపమ.. అభిమానులతో టచ్‌లో ఉంటుంది. తాజాగా ఓ ఖడ్గమృగం పిల్లకి సంబ ంధించిన ఓ వీడియోని పోస్ట్ చేసి, దీన్ని ఎవరైనా తనకు బహుమతిగా ఇస్తే తను వాళ్ల సొంతమైపోతానని చెప్పింది. అంటే డేటింగ్ లేదా పెళ్లి చేసుకుంటాననిఫన్నీగా చెప్పింది. ఇప్పుడీ క్యాప్షన్‌పై ఫన్నీ కామెంట్స్ వస్తున్నాయి.



# గేమ్‌ఛేంజర్ విడుదలలో మరింత ఆలస్యం




ట్రిపుల్ ఆర్ సినిమాతో ఇంటర్నేషనల్ వైడ్‌గా క్రేజ్ తెచ్చుకున్న హీరో రామ్ చరణ్ తన తరువాతి సినిమాని సెన్సేషనల్ డైరక్టర్ శంకర్ గేమ్ ఛేంజర్‌తో వస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమలో రామ్ చరణ్ డ్యూయల్ రోల్ నటిస్తున్నారు. చాలా కాలంగా షూటింగ్ జరపుకుంటున్న ఈ సినిమా ఒకనొక టైంలో 2024 సంక్రాంతికి రిలీజ్ చేస్తారని ఫ్యాన్స్ ఎంతగానో ఎదురుచూశారు. అంతేకాదు ఈ సినిమా గురించి అప్డేట్స్ ఇవ్వకుంటే..ఆత్మహత్య చేసుకుంటా అంటూ బెదిరింపు లేఖలు కూడా దర్శనం ఇచ్చాయి. అయితే డైరక్టర్ శంకర్‌కు ఉన్న డిమాండ్స్ మేరకు షూటింగ్ ఇబ్బందులు, ఇంకా కొన్నిటెక్నీకల్ కారణాల వల్ల సంక్రాంతికి రిలీజ్ కాకపోడంతో పాటు ఎలాంటి అప్డేట్ కూడా ఇవ్వలేదు. దీంతో గేమ్ ఛేంజర్ రిలీజ్ ఎప్పుడనే విషయాన్ని మూవి టీమ్ సస్పెన్స్‌లో ఉంచుతూ.. షూటింగ్ మీద పోకస్ చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు 80 శాతం షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా డిసెంబర్ 25న క్రిస్మస్ సందర్భంగా రాబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. త్వరలో మేకర్స్ అఫిసియల్ డేట్ అనౌన్స్ చేసే అవకాశం ఉంది. అయితే,అక్టోబర్‌లో దసరా కనుకగా రిలీజ్ చేస్తారని చరణ్ ఫ్యాన్స్ అశపడ్డారు. కానీ, ఇప్పుడు అది కూడా కష్టంగా మారిందని తెలుస్తుంది. ఎందుకంటే దసరాకి ఎన్టీఆర్ నటిస్తున్న దేవర సినిమా వస్తుండటంతో గేమ్ చేంజర్ మూవీని క్రిస్మస్ కానుకగా రిలీజ్ చేయాలనీ డిసైడ్ అయినట్లు సమాచారం. డైరెక్టర్ శంకర్..కమల్ హాసన్ ఇండియాన్ 2 కూడా తెరకెక్కిస్తుండటంతో..గేమ్ చేంజర్ లేట్ కు అసలైన కారణం అని తెలుస్తోంది. ఏదేమైనప్పటికీ వరల్డ్ వైడ్ గా ఫేమస్ అయిన చరణ్..తనదైన కోణంలో సినిమాలు తీసే శంకర్ కలిసొచ్చే ఈ సినిమా ఇండస్టీ ఆల్ టైం హిట్ గా చూడాలనేది ఫ్యాన్స్ కోరిక. ఈ సినిమాను స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు నిర్మిస్తుండగా..బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ మూవీలో అంజలి, శ్రీకాంత్, సునీల్, నవీన్ చంద్ర తదితరులు నటిస్తున్నారు.యస్ యస్ థమన్ సంగీతం అందిస్తున్నారు.

# పోచర్ వెబ్‌సీరిస్ చూసి మహేశ్ బాబు ఎమోషనల్



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ నిర్మాతగా మారి తెరకెక్కించిన తాజా వెబ్ సిరీస్ 'పోచర్'. ఈ సిరీస్‌ను ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోతో కలిసి అలియా భట్ నిర్మించింది. ప్రస్తుతం ఈ వెబ్ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వెబ్ సిరీస్ చూసిన సూపర్ స్టార్ మహేష్ బాబు 'పోచర్'పై ప్రశంసల వర్షం కురిపించాడు. ఎవరైనా ఏనుగులను అలా ఎలా చంపగలరు. వారికి మానవత్వం లేదా? అలా చేస్తున్నప్పుడు వారి చేతులు వణకడం లేదా? ఈ క్రైమ్-థ్రిల్లర్ చూస్తున్నప్పుడు నా మైండ్ లో ఇవే ప్రశ్నలు తిరుగుతూ ఉన్నాయి. ఈ జెంటిల్ జెయింట్స్ ని కాపాడుకునేందుకు సమాజంలో ప్రతి ఒక్కరు పోరాడాలి అంటూ మహేష్ రాసుకొచ్చాడు. కాగా ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మలయాళ నటులు నిమిషా సజయన్, రోషన్ మథ్యూ, దివ్యేంద్ర భట్టాచార్య తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ వెబ్ సిరీస్‌కు ఎమ్మీ అవార్డు విన్నర్ రిచీ మెహతా దర్శకత్వం వహించాడు. అమెజాన్ ప్రైమ్ లో హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రస్తుతం అందుబాటులో ఉంది. ఈ సిరీస్ కథ విషయానికి వస్తే.. ఏనుగు దంతాల స్మగ్లింగ్‌తో పాటు, అడవుల్లో వన్య ప్రాణులపై దాడుల చేసే వారిపై ఈ సిరీస్ వచ్చింది. ఇక వారిని పట్టుకునేందుకు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారులు, ఔఉక్ష కార్మికులు, లోకల్ పోలీసులు ఎం చేశారు అనేది ఈ సిరీస్ కథ.



# మార్చి 1న వస్తోన్న చారి 111

'వెన్నెల' కిశోర్ హీరోగా నటించిన చిత్రం 'చారి 111'. సంయుక్తా విశ్వనాథన్ కథానాయికగా, మురళీ శర్మ ప్రధాన పాత్రల్లో నటించారు. టీజీ కీర్తీకుమార్ దర్శకత్వంలో అదితీ సోనీ నిర్మించిన ఈ చిత్రం మార్చి 1న విడుదలవుతోంది. అదితీ సోనీ మాట్లాడుతూ? నిర్మాతగా 'చారి 111' నా తొలి సినిమా. వైవిధ్యమైన కథతో తీసిన మంచి వినోదాత్మక చిత్రమిది. వెన్నెల కిశోర్ కామెడీని ప్రతి ఒక్కరు ఎంజాయ్ చేస్తారు' అన్నారు. మళ్ళీ మొదలైంది' సినిమా తర్వాత నేను చేసిన ద్వితీయ చిత్రం 'చారి 111'. ఇదొక స్పై యాక్షన్ కామెడీ జానర్ ఫిల్మ్ అన్నారు టీజీ కీర్తీకుమార్. ఈ సినిమాలో ఒక్కటే పాట ఉంది. ఈ పాటని అద్భుతంగా రాయడానికి మూ డు నెలల సమయం తీసుకున్నానని అన్నారు రామజోగయ్య శాస్త్రి. తెలు గులో నాకు తొలి చాన్స్ ఇచ్చిన యూనిట్‌కి థ్యాంక్స్ అన్నారు సంయుక్తా విశ్వనాథన్. ఈ సినిమాకు మ్యూజిక్ అందించడం హ్యాపీగా ఉందని అన్నారు సైమన్ కె. కింగ్.



# హీరో శ్రీవిష్ణు, దర్శకుడు హసిత్ గోలి కాంబినేషన్

## నేడు టైటిల్ ప్రకటించనున్న మూవీ టీమ్

హీరో శ్రీవిష్ణు, దర్శకుడు హసిత్ గోలి కాంబినేషన్‌లో వచ్చిన 'రాజ రాజ చోర' చిత్రం నవ్వుల వర్షం కురిపించి.. బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. ఈ కాంబినేషన్ మరోసారి రిపీట్ కాబోతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై ప్రముఖ నిర్మాత టిజి విశ్వ ప్రసాద్ నిర్మించబోయే కొత్త చిత్రం కోసం వీరు మళ్లీ కలిశారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. ఈ చిత్రాన్ని ప్రొడక్షన్ నెం 32గా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అఫీషియల్‌గా అనౌన్స్ చేస్తూ.. తాజాగా ఓ పోస్టర్ వదిలారు. ఈ అనౌన్స్‌మెంట్ పోస్టర్ చాలా ఫన్ జనరేట్ చేస్తోంది. ఈ సినిమా టైటిల్‌ని గురువారం శ్రీవిష్ణు పుట్టినరోజు సందర్భంగా ప్రకటించనున్నారు. దానికి నామకరణం ఈవెంట్ అని పేరు పెట్టారు. ఇది అచ్చతెలుగు సినిమా అని చెప్పడమే దీని ఉద్దేశం. పోస్టర్ సూచించినట్లుగా ఈ కొత్త చిత్రం బిగ్గర్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోందని మేకర్స్ చెబుతున్నారు. సూపర్ హిట్ 'రాజ రాజ చోర'తో ఆకట్టుకున్న హసిత్ గోలి.. శ్రీవిష్ణును హిలేరియస్ పాత్రలో ప్రజెంట్ చేయడానికి మరొక వినోదాత్మక, విన్నింగ్ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు. మరోవైపు, శ్రీవిష్ణు తన గత చిత్రం 'సామజవరగమన' బ్లాక్‌బస్టర్ సక్సెస్‌తో టాప్ ఫామ్‌లో వున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోయే ఈ చిత్రం.. మరోసారి బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తుందని నిర్మాణ సంస్థ భావిస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను గురువారం వెల్లడించనున్నారు.






# పుష్ప-2 కోసం భారీగా ఖర్చు




ప్రస్తుతం ఇండియాలో మోస్ట్ అవైటెడ్ మూవీ ఏదైనా ఉందా? అంటే అది పుష్ప-2 అనే చెప్పాలి. లెక్కల మాస్టార్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్‌లో 2022 డిసెంబర్‌లో వచ్చిన పుష్ప సినిమా పాన్ ఇండియా రేంజ్‌లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. తగ్గేదేలే.. అంటూ బన్నీ చెప్పిన డైలాగ్ దేశవ్యాప్తంగా సినీ అభిమానులకు తెగ నచ్చేసింది. ఈ సినిమా సెకండ్ పార్ట్ ఎప్పుడెప్పుడు వస్తుందా అని సినీ అభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ సోషల్ మీడి యాలో వైరల్ అవుతుంది. ఈ మూవీలో ఇంటర్వెల్ సీన్ గంగమ్మ జాతర బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ ఇంటర్వెల్ సీన్ కోసమే మేకర్స్ రూ.50 కోట్లు ఖర్చుపెట్టినట్లు టాక్ వినిపిస్తోంది. గంగమ్మ జాతర సీక్వెన్స్ దాదాపు 25 నిమిషాలు ఉండనున్నట్లు తెలుస్తోంది. దీంతో మూవీ ఎంత గ్రాం డ్‌గా ఉంటుందోనని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. చిత్తూరు, తిరుపతిలోని ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో ఈ సినిమా కథ సాగనుండగా.. తిరుపతిలోని స్థానిక గంగమ్మ జాతరలోని సంప్రదాయాన్ని సుక్కు ఈ సినిమాలో చూపించనున్నాడు.